

సిరాచుక్క చూపిస్తున్న జీఎం కార్యాలయ ఉద్యోగులు

గరిష్టం/కనిష్టం
28.4 / 13.3

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా తగ్గుతాయి. చలి ప్రభావం కొంత తగ్గుతుంది. తెల్లవారు జామున పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు



విజేతలతో అధికారులు, ప్రతినిధులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ జూనియర్ అథ్లెటిక్స్ మీట్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహించారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్ మాట్లాడుతూ అథ్లెటిక్స్ అండర్– 14, 16 విభాగంలో బాలబాలికలకు నిర్వహించిన పోటీల్లో వివిధ పాఠశాలల నుంచి 120 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. 13 మంది జాతీయస్థాయికి ఎంపికైనట్లు వెల్లడించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఎంపికైన విద్యార్థులు ఫిబ్రవరిలో గుజరాత్‌లో నిర్వహించే జాతీయ స్థాయి పాల్గొంటారని వివరించారు. కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శంకర్, డీఎస్‌వో మీనారెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనాథ్, పీడీ, పీఈటీలు లక్ష్మణ్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

సొంత నిర్ణయాలు తీసుకునే స్థాయికి ఎదగాలి



మాట్లాడుతున్న జెండర్ స్పెషలిస్ట్ రాణి

ఆసిఫాబాద్‌అర్బన్: మహిళలు సొంతంగా నిర్ణయాలు తీసుకునే స్థాయికి ఎదిగి, అన్ని రంగాల్లో రాణించేందుకు ప్రణాళికలు రూపొందించుకోవాలని మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ రాణి అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా మహిళా సమాఖ్య సమావేశంలో బుధవారం జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలపై జరిగే హింసపై ప్రతిఒక్కరికి అవగాహన ఉండాలన్నారు. ఇళ్లు, బయట జరిగే హింస, అత్యాచారాలు, పని ప్రదేశాలల్లో లైంగిక, శారీరక, మానసిక, ఆర్థిక పరమైన వేధింపులకు గురైనప్పుడు ఆందోళన చెందకుండా బాధితులు ధైర్యంగా ముందుకు రావాలన్నారు. ఉమెన్ హెల్ప్‌లైన్ నంబర్ 181, చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098కు సమాచారం అందించాలని సూచించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవడం నేరమని, బాధ్యులకు శిక్ష తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో అదనపు డీఆర్‌డీవో శ్రీనివాస్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు శ్రీదేవి, కోశాధికారి అన్నపూర్ణ, డీపీఎంలు యాదగిరి, అన్నాజీ, సారయ్య, యశోద, ఏపీఎం మహిత పాల్గొన్నారు.

ఆదివాసీ హక్కులపై అలుపెరగని పోరాటం

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్



మాట్లాడుతున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

ఆసిఫాబాద్: ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తే ఎంతటి పోరాటానికైనా సిద్ధమేనని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ స్పష్టం చేశారు. కుమురంభీం ఆసిఫాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జెడ్పీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించి, ఎస్టీలను చైర్‌పర్సన్‌లుగా నియమించాలని డిమాండ్ చేస్తూ బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట బీఎస్పీ, ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ఆదివాసీలకు కుమురంభీం ఆత్మసాక్షిగా వ్యవస్థీకృతమైన అన్యాయం జరిగిందని ఆరోపించారు. ఎస్టీలకు రిజర్వ్ చేసిన జెడ్పీ చైర్‌పర్సన్ స్థానాల్లో జనరల్ కేటగిరికి చెందిన జెడ్పీ వైస్‌చైర్మన్‌లను తాత్కాలిక చైర్మన్లుగా నియమించడం ఆదివాసీ గిరిజనుల హక్కులు కాలరాయడమేనన్నారు. అటవీ అధికారులపై దాడి చేసి జైలుకెళ్లిన కోనేరు కృష్ణారావును ఆసిఫాబాద్ జెడ్పీ చైర్మన్‌గా నియమించడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఆదివాసీ మహిళ సీతక్కను పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా ఎంపిక చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం సమర్పించారు. బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శులు అర్షద్ హుస్సేన్, సిడాం గణపతి, జిల్లా అధ్యక్షుడు శ్యాంరావు, నాయకులు చిన్నయ్య, ప్రభాకర్, బన్సీలాల్ రాథోడ్, మెస్రం జంగు, రాంప్రసాద్, దుర్గం ప్రవీణ్, గణేశ్, తిరుపతి, ఆదివాసీ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చుక్క.. పొడిచింది

- బెల్లంపల్లి ఏరియాలో ఏఐటీయూసీ విజయం
- 'గుర్తింపు' ఎన్నికల్లో సత్తా చాటిన కామ్రేడ్లు
- 375 ఓట్లతో ఐఎన్టీయూసీకి రెండోస్థానం
- సింగిల్ డిజిట్‌కే పరిమితమైన టీబీజీకేఎస్



ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి తిరుపతిని ఎత్తుకుని కేరింతలు కొడుతున్న నాయకులు, కార్యకర్తలు

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో బెల్లంపల్లి ఏరియాలో ఎర్రజెండా రెపరెపలాడింది. సీపీఐ అనుబంధ సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) 122 ఓట్ల అధిక్యంతో విజయ ఢంకా మోగించింది. ఏరియా పరిధిలో మొత్తం 996 మంది కార్మికుల్లో 959 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఏఐటీయూసీ 497 ఓట్లు సాధించింది. గట్టి పోటీ ఇస్తుందని భావించిన కాంగ్రెస్ అనుబంధ సంఘం సింగరేణి కోల్‌మైన్ లేబర్ యూనియన్(ఐఎన్టీయూసీ) 375 ఓట్లతో రెండోస్థానంలో నిలిచింది. అగ్రనేతల రాజీనామాలతో డీలాపడిన తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం(టీబీజీకేఎస్)కు కేవలం మూడు ఓట్లు మాత్రమే వచ్చాయి. ఇక సింగరేణి మైనర్స్ అండ్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్(హెచ్‌ఎంఎస్)61, సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) 11, సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘం 6, గోదావరిలోయ బొగ్గుగని కార్మిక సంఘం 3 ఓట్ల చొప్పున సాధించాయి. మరో 3 ఓట్లు చెల్లలేదు.

ఏఐటీయూసీ సంబురాలు

బెల్లంపల్లి ఏరియాలో ఏఐటీయూసీ ఘన విజయం సాధించడంతో ఆ యూనియన్ నాయకులతోపాటు ఎన్నికల్లో మద్దతుగా నిలిచిన టీబీజీకేఎస్ నాయకులు గోలేటి టౌన్‌షిప్‌లో విజయోత్సవ సంబురాలు చేసుకున్నారు. స్వీట్లు తినిపించుకుని రంగులు చల్లుకుంటూ ర్యాలీ నిర్వహించారు.

ప్రశాంతంగా ఎన్నికలు

వాయిదాలు, కోర్టు విచారణలు.. అనేక పరిణామాల మధ్య ఎట్టకేలకు సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. అక్టోబర్‌లోనే జరగాల్సిన ఎన్నికలను అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కోర్టు ఆదేశాలతో డిసెంబర్ 27కు వాయిదా వేశారు. ఇటీవల ప్రభుత్వం మరోసారి గుర్తింపు ఎన్నికలు వాయిదా వేయాలని కోర్టును ఆశ్రయించినా.. కోర్టు అంగీకరించకపోవడంతో గతంలో ప్రకటించిన విధంగానే సింగరేణి గుర్తింపు ఎన్నికలు నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ ప్రక్రియ పూర్తయింది. రాత్రి 7 గంటల నుంచి సీఈఆర్ క్లబ్‌లో ఓట్ల లెక్కింపు చేపట్టారు. ఎన్నికల్లో జోరు చూపిస్తుందని భావించిన టీబీజీకేఎస్ రాష్ట్ర నాయకత్వం చేతులెత్తేయడంతో ఏరియా స్థాయి నాయకులు ఇతర యూనియన్‌లకు మద్దతు ప్రకటించారు. కార్యకర్తలు నచ్చిన యూనియన్‌లో చేరారు.

పోలింగ్ వివరాలు

పోలింగ్ కేంద్రం	కార్మికులు	ఓటు వేసింది	శాతం
పీఎంఈ సెంటర్	185	180	97.30
బీపీఏ ఓసీపీ క్యాంటీన్	96	93	96.9
ఖైరిగూడ ఓసీపీ	533	512	96.1
గోలేటి సీహెచ్‌పీ	104	100	96.2
ఏరియా ఆస్పత్రి	78	74	94.9

96.3 శాతం పోలింగ్

సాధారణ ఎన్నికలతో పోల్చితే గుర్తింపు ఎన్నికల్లో ఓటు వేసేందుకు కార్మికులు ఆసక్తి చూపారు. ఏరియాలో మొత్తం 996 మంది కార్మికులు ఉండగా.. 959 మంది తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. 96.3శాతం పోలింగ్ నమోదైంది. గోలేటి టౌన్‌షిప్‌లోని పీఎంఈ సెంటర్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 185 మంది ఓటర్లకు 180 మంది, బీపీఏ ఓసీపీ క్యాంటీన్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో 96 మందికి 93 మంది, ఖైరిగూడ ఓసీపీలో ఏర్పాటు చేసిన కేంద్రంలో 533 మందికి 512 మంది, గోలేటి సీహెచ్‌పీ కేంద్రంలో 104 మందికి 100 మంది, బెల్లంపల్లి ఏరియా ఆస్పత్రిలో 78 మందికి 74 మంది మంది కార్మికులు ఓటుహక్కు వినియోగించుకున్నారు.

పటిష్ట బందోబస్తు..

బెల్లంపల్లి ఏరియాలో ప్రధానంగా ఐఎన్టీయూసీ, ఏఐటీయూసీ మధ్యే పోటీ ఏర్పడింది. ప్రత్యేక జీవో ద్వారా సింగరేణిలో ఉద్యోగాలు సాధించిన భూనిర్వాసితుల వారసులు మొదటిసారిగా గుర్తింపు ఎన్నికల్లో ఓటుహక్కు లభించడంతో ఉత్సాహంగా ఓటు వేశారు. రెబ్బెన మండలానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులను ఎన్నికల సిబ్బందిగా నియమించారు. ఆరుగురు ప్రిసైడింగ్ అధికారులు, ఆరుగురు అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు మరో 12 మంది ఇతర పోలింగ్ అధికారులు ఎన్నికల విధుల్లో పాలుపంచుకున్నారు. పోలింగ్ కేంద్రాలు, ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా డీఎస్పీ వెంకటరమణ ఆధ్వర్యంలో సీఐ, ఆరుగురు ఎస్సైలు, 50 మంది పోలీస్ సిబ్బంది, ఎస్‌అండ్‌పీసీ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

ఓటింగ్ సరళి(ప్రతీ గంటకు)

సమయం	పోలైన ఓట్లు	శాతం
8	244	24.5
9	379	38.1
10	488	49.0
11	577	57.9
12	670	67.3
01	755	75.8
02	828	83.1
03	880	88.4
04	952	95.6
05	959	96.3



ఆస్పత్రి నుంచి అంబులెన్స్‌లో వచ్చి ఓటు వేసిన కార్మికుడు అబ్దుల్ ఘని



ఓటు వేస్తున్న కార్మికుడు



ఖైరిగూడ ఓసీపీ వద్ద ఓటు వేసేందుకు క్యూలో కార్మికులు



మొదటిసారి ఓటుహక్కు వినియోగించుకున్న కార్మికులు



కార్మికుడి వేలికి సిరాచుక్క పెడుతున్న ఎన్నికల సిబ్బంది



గోలేటిలోని సీఈఆర్ క్లబ్‌లో ఓట్లు లెక్కిస్తున్న ఎన్నికల సిబ్బంది

అర్హులందరికీ ఆరు గ్యారంటీలు

- అధికారులు, ప్రజాప్రతినిధులు జోడెద్దుల్లా పనిచేయాలి
- ప్రజల జీవన ప్రమాణాలు పెంచేలా కృషి చేయాలి
- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క
- ప్రజా పాలనపై ఉమ్మడి జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష

కైలాస్‌నగర్: ప్రజల సంక్షేమం, అభివృద్ధి దిశగా ప్రభుత్వం చేపట్టిన ఆరు గ్యారంటీలను పకడ్బందీగా అమలు చేసి అర్హులైన ప్రతి ఒక్కరికి అందించేలా కృషి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటిపారుదల, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఈ నెల 28 నుంచి జనవరి 6 వరకు నిర్వహించనున్న ప్రజాపాలన కార్యక్రమ నిర్వహణపై ఆదిలాబాద్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లా సన్నాహక సమీక్ష బుధవారం నిర్వహించారు. నాలుగు జిల్లాల ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించి ప్రజాపాలన విజయవంతానికి అనుసరించాల్సిన కార్యాచరణపై దిశా నిర్దేశం చేశారు. అనంతరం మీడియా సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు జోడెద్దుల్లా జిల్లా అభివృద్ధి కోసం కలిసికట్టుగా కృషి చేయాలని సూచించారు. గ్రామ స్థాయి నుంచి అభివృద్ధి జరిగేలా మండల, జిల్లా స్థాయి అధికారులు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని సూచించారు. ప్రజల జీవన ప్రమాణాలు పెంచేవిధంగా ప్రభుత్వ పథకాలను అమలు చేయాలన్నారు. ప్రజాస్వామ్యాన్ని నమ్ముకున్న, ప్రజా పాలనకు కట్టుబడి ఉన్న ప్రభుత్వంగా ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామన్నారు. ఈ నెల 9న రాష్ట్రవ్యాప్తంగా బాలికలు, మహిళలకు ఉచిత రవాణ సౌకర్యాన్ని లాంఛనంగా ప్రారంభించడంతో పాటు రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం పరిమితిని రూ.5లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచినట్లు గుర్తు చేశారు. ఈ నెల 28నుంచి జనవరి 6 వరకు మహాలక్ష్మి, రైతు భరోసా, గృహ జ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పథకాల కోసం అన్ని గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల్లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఇందుకు పూర్తిస్థాయి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రజల స్థితిగతులకనుగుణంగా సర్వతోముఖాభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. గిరిజనుల సంక్షేమం, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసం అంకితభావంతో పని చేయాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ప్రజా పాలన ఉమ్మడి జిల్లా నోడల్ అధికారిగా ఎం.ప్రశాంతి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ పర్యవేక్షణకు ఉమ్మడి జిల్లాల వారీగా నోడల్ అధికారులను నియమించింది. ఇందులో భాగంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు ఐఏఎస్ అధికారి ఎం.ప్రశాంతిని నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

జిల్లాలో అన్ని ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయడంతో పాటు విద్య, వైద్యం, సంక్షేమం, రహదారుల అనుసంధానం వంటి కార్యక్రమాలను అమలు చేసేందుకు ఆదర్శవంతమైన ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించేందుకు, ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలను అర్హులందరికీ అందించేందుకు, రాజకీయాలకు అతీతంగా కలిసి రావాలని కోరారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు పొరుగున ఉన్న మహారాష్ట్ర నుంచి వలసలు నియంత్రించడం, ప్రభుత్వ పథకాలను దుర్వినియోగం కాకుండా అర్హులైన వారికి అందించేందుకు పర్యవేక్షణ కోసం ప్రత్యేక అధికారిని నియమించనున్నట్లు తెలిపారు. అనంతరం ప్రజా పాలన అభయ హస్తం, ఆరు గ్యారంటీలకు శ్రీకారం పోస్టర్లను మంత్రి ఆవిష్కరించారు. కలెక్టరేట్ సమావేశ మందిరానికి చేరుకున్న మంత్రికి ప్రజాప్రతినిధులు, అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్లు జనార్దన్ రాథోడ్, విజయలక్ష్మి, కోనేరు కృష్ణారావు, బెల్లంపల్లి, ఖానాపూర్ ఎమ్మెల్యేలు గడ్డం వినోద్, వెడ్మ బొజ్జు పటేల్, మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్, ఆదిలాబాద్, నిర్మల్, కుమురంభీం జిల్లాల ఎస్పీలు ఉదయ్‌కుమార్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, సురేశ్‌కుమార్, మంచిర్యాల డీసీపీ సుధీర్ రాంనాథ్, అదనపు కలెక్టర్లు ఖుష్బూ గుప్తా, ఫైజాన్ అహ్మద్, దీపక్ తివారి, సబావత్ మోతిలాల్, ప్రత్యేకాధికారులు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, తహసీల్దార్లు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'ప్రజా పాలన'కు సర్వం సిద్ధం

- నేటి నుంచి గ్రామ, వార్డు సభలు
- జనవరి 6 వరకు దరఖాస్తుల స్వీకరణ
- ప్రతీ వంద కుటుంబాలకు ఒక కౌంటర్
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



కెరమెరిలో అధికారులకు అవగాహన కల్పిస్తున్న ప్రత్యేకాధికారి శ్రీనివాస్

తిర్యాణి(ఆసిఫాబాద్): సంక్షేమ పథకాల అమలులో భాగంగా కాంగ్రెస్ సర్కారు మరో ముందడుగు వేసింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను పకడ్బందీగా అమలు చేసేందుకు చర్యలు చేపట్టింది. అర్హుల గుర్తింపులో అవకతవకలకు తావులేకుండా.. క్షేత్రస్థాయి ప్రజలు ఇబ్బందులు పడకుండా ప్రణాళికలు రూపొందించింది. గ్రామాల్లో అర్హుల నుంచి సంక్షేమ పథకాలకు దరఖాస్తులు స్వీకరించేందుకు ఈ నెల 28 నుంచి జనవరి 6 వరకు ప్రజా పాలన కార్యక్రమం పేరుతో గ్రామ సభలు నిర్వహించేందుకు సిద్ధమైంది. ఇందుకోసం ఇప్పటికే మండలాల వారీగా ప్రత్యేకాధికారుల నియామకం పూర్తయింది. జిల్లా అధికారులకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. బుధవారం ఆయా మండల కేంద్రాల్లో గ్రామ సభల నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులు, ఇతర శాఖల అధికారులతో ప్రత్యేకాధికారులు సన్నాహక సమావేశాలు నిర్వహించారు.

ఐదు పథకాలకు ఒకే దరఖాస్తు..

అభయ హస్తం పేరిట రూపొందించిన నాలుగు పేజీల దరఖాస్తు ఫారాన్ని బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. ప్రజా పాలన గ్రామ సభల్లో అర్హులు ఈ దరఖాస్తును నింపి అధికారులకు సమర్పించాలి. కుటుంబ యజమాని, కుటుంబ సభ్యుల వివరాలతో పాటు ఆధార్, రేషన్ కార్డు నంబర్లను తప్పనిసరిగా నమోదు చేయాల్సి ఉంది. కులం, పుట్టిన తేదీ, మొబైల్ నంబర్, వృత్తి, చిరునామా తదితర వివరాలు నింపాలి. ఐదు గ్యారంటీలైన మహాలక్ష్మి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, గృహజ్యోతి, చేయూత పథకాలకు అవసరమైన వివరాలు పొందుపర్చాల్సి ఉంటుంది. వీటితోపాటు దరఖాస్తుదారుడి ఫొటో, రేషన్ కార్డు, కుటుంబ సభ్యుల జిరాక్స్‌లను జతపర్చాలి. దరఖాస్తు సమర్పించిన తర్వాత అధికారులు ప్రజా పాలన దరఖాస్తు రశీదును దరఖాస్తుదారులకు అందిస్తారు. ప్రజా పాలన కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా అధికారులకు బాధ్యతలు అప్పగించారు. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ మండలాలకు కదం సురేశ్(ఆర్డీవో)ను నియమించగా.. బెజ్జూర్‌కు వెంకటేశం(డీహెచ్‌ఎస్‌వో), చింతలమానెపల్లి సీహెచ్ కుటుంబరావు(అడిషనల్ డీఆర్‌డీవో), దహెగాం విజయ్‌కుమార్(ఏడీ, ఫిషరీస్), జైనూర్ గుణవంత్ రావ్(ఈఈ ఇరిగేషన్), కాగజ్‌నగర్ శ్రీనివాస్‌రావు(డీఏవో), కెరమెరి శ్రీనివాస్(అదనపు డీఆర్‌డీవో), కౌటాల సురేందర్(డీఆర్‌డీవో), లింగాపూర్ సురేష్(డీవీఏహెచ్‌వో), పెంచికల్‌పేట్ రామకృష్ణ(ఏపీడీ), రెబ్బెన ప్రభాకర్(ఈఈ పీఆర్), సిర్పూర్(టి) సురేశ్‌బాబు(డీఎల్‌పీవో), సిర్పూర్(యూ) వెంకటపతి(ఈఈ ఆర్‌డబ్ల్యూఎస్), తిర్యాణి రమాదేవి(డీటీడీవో), వాంకిడి షేక్ మహమూద్(డిస్ట్రిక్ కోఆపరేటివ్ ఆడిట్ అధికారి), ఆసిఫాబాద్‌కు తారామణి(డీఎస్‌వో) ప్రత్యేకాధికారులుగా వ్యవహరిస్తారు.

జిల్లా వివరాలు

మండలం/మున్సిపాలిటీ	జీపీలు/వార్డులు	గృహాలు	కౌంటర్లు
ఆసిఫాబాద్	27	35,060	170
బెజ్జూర్	22	6,056	69
చింతలమానెపల్లి	19	7,903	72
దహెగాం	24	7,988	88
జైనూర్	26	7,267	83
కాగజ్‌నగర్	28	14,959	121
కాగజ్‌నగర్(యూఎల్‌బీ)	30	13,887	120
కెరమెరి	31	8,475	84
కౌటాల	20	9,693	63
లింగాపూర్	14	2,969	38
పెంచికల్‌పేట్	12	4,650	38
రెబ్బెన	24	9,907	94
సిర్పూర్(టి)	16	8,432	87
సిర్పూర్(యు)	15	3,287	39
తిర్యాణి	29	7,272	82
వాంకిడి	28	8,207	87
మొత్తం	365	1,56,012	1,335

పకడ్బందీగా గ్రామ సభలు

జిల్లాలోని 15 మండలాల పరిధిలో 335 గ్రామ పంచాయతీలు, కాగజ్‌నగర్ మున్సిపాలిటీ ఉంది. ఈ నెల 28 నుంచి జనవరి 6 వరకు మొత్తం ఎనిమిది పనిదినాల్లో గ్రామ సభలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు.. మళ్లీ మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. 1,56,012 గృహాల నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు 1,335 కౌంటర్లు ఏర్పాటు చేయనున్నారు. దరఖాస్తుల స్వీకరణ సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా ప్రతీ వందకుటుంబాలకు ఒక కౌంటర్ ఏర్పాటు చేస్తున్నారు. స్త్రీ, పురుషులకు వేర్వేరుగా కౌంటర్లు ఉంటాయి. ఒక వేళ గ్రామ సభ నిర్వహించే సమయంలో అందుబాటులో లేని వారు వచ్చే నెల 6లోగా సంబంధిత జీపీ కార్యాలయంలోనే దరఖాస్తును సమర్పించే వెసులుబాటు కల్పించారు. తహసీల్దార్, ఎంపీడీవోలు బృందాలుగా ఏర్పడి గ్రామ సభల్లో పాల్గొంటారు. అలాగే దరఖాస్తు దారుల నుంచి సేకరించిన వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు.

క్లుప్తంగా

గృహహింస కేసులో ఒకరికి ఆరునెలల జైలు

భీమిని: భీమిని పోలీస్‌స్టేషన్ పరిధి ఊరు మందమర్రికి చెందిన ఓరుగంటి రమేశ్ తన భార్య లావణ్యను అదనపు కట్నం కోసం వేధించాడు. దీంతో లావణ్య తన భర్త రమేశ్ గృహహింసకు పాల్పడుతున్నట్లు 2007లో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ కేసులో బెల్లంపల్లి కోర్టు జడ్జి ముఖేశ్ రమేశ్‌కు ఆరునెలల జైలు, రూ.500 జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు చెప్పినట్లు భీమిని ఎస్సై ప్రశాంత్ తెలిపారు.

హైమన్‌డార్ఫ్ వర్ధంతికి మంత్రి సీతక్కకు ఆహ్వానం


సీతక్కకు ఆహ్వానపత్రం ఇస్తున్న కనకరాజు

జైనూర్: ప్రొఫెసర్ హైమన్‌డార్ఫ్ పుణ్య దంపతుల వర్ధంతికి రావాలని కోరుతూ పద్మశ్రీ కనకరాజు, గ్రామస్తులు పంచాయతీరాజ్, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్కకు ఉట్నూర్‌లో బుధవారం ఆహ్వానపత్రం అందించారు. ఈ సందర్భంగా ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ.. ఆదివాసీలను చైతన్యపరిచిన మార్లవాయి, జోడేఘాట్, ఇంద్రవెల్లి గ్రామాల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమై ప్రత్యేక నిధుల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మార్లవాయి సర్పంచ్ కనక ప్రతిభ, వెంకటేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

29న జిల్లాస్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు

నస్పూర్: పట్టణ పరిధిలోని శ్రీరాంపూర్ ప్రగతి స్టేడియంలో ఈ నెల 29న జిల్లాస్థాయి జూనియర్స్ బాలబాలికల కబడ్డీ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ రాంచందర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికైన జిల్లా జట్టు జనవరి 11నుంచి 14వ తేదీ వరకు సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో జరిగే 49వ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో జిల్లా జట్టు తరఫున పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9963719719 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

కమ్ముకున్న పొగమంచు


కత్తెరసాల నుంచి ఇతర గ్రామాలకు వెళ్లే రహదారిలో కమ్ముకున్న పొగమంచు

చెన్నూర్‌రూరల్: మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం ఉదయం పొగమంచు కమ్ముకుంది. ఉదయం పూట ప్రారంభమైన పొగమంచు 9గంటల వరకు అలాగే ఉంది. ఆయా గ్రామాలకు వెళ్లే రహదారులు పొగమంచుతో కమ్ముకున్నాయి. ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనబడక వాహనదారులు లైట్లు వేసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

అటవీ జంతువులను వేటాడితే చర్యలు

ఇంద్రవెల్లి: వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు తప్పవని ఇంద్రవెల్లి అటవీశాఖ రేంజ్ అధికారి సంతోష్ హెచ్చరించారు. మండల కేంద్రంలో అడవి పంది మాంసం అమ్ముతూ పట్టుబడిన ఉమ, దత్తాత్రి పై కేసు నమోదు చేసి బుధవారం జూనియర్ సివిల్ జడ్జి కం జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్‌క్లాస్ కోర్టు బోథ్‌కు రిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. చెట్లు నరికినా.. వన్య ప్రాణులను వేటాడి హతమార్చినా కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్వోలు నర్సయ్య, గోవింద్, చంద్రారెడ్డి, సిబ్బంది ఉన్నారు.

అడవిలో వ్యూలైన్స్

- జన్నారం అటవీ డివిజన్‌లో 126 కిలో మీటర్లలో ఏర్పాటు చేసిన అధికారులు
- జంతువులను గమనించేందుకే..
- ప్రమాదాల నివారణకు తప్పనిసరి


గొండుగూడ బేస్‌క్యాంప్ వైపు ఏర్పాటు చేసిన వ్యూలైన్స్

జన్నారం: గుబురు మొక్కలు, దట్టమైన చెట్లు, పొదల నుంచి ఒకేసారి వన్యప్రాణి బయటకు వస్తే అపాయం జరిగే అవకాశాలున్నాయి. అపాయం జరగకుండా, వన్యప్రాణి బయటకు కనిపించేలా అటవీశాఖ వ్యూలైన్స్ ఏర్పాటు చేసింది. ఈ వ్యూలైన్స్ ద్వారా ప్రమాదాలు అరికట్టవచ్చని అటవీ అధికారులు చెబుతున్నారు. జన్నారం అటవీ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో సుమారు 126 కిలో మీటర్ల వ్యూలైన్స్ ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.

వ్యూలైన్స్ ద్వారా ఎలా అంటే..

వ్యూలైన్స్ ద్వారా ప్రమాదాలు ఎలా అరికట్టవచ్చనే సందేహం అందరిలో కలుగుతుంది. దారికి ఇరువైపులా గల చెట్ల పొదల నుంచి అడవి పందులు, చుక్కల దుప్పులు, ఎలుగుబంట్లు, నీలుగాయిలు బయటకు వచ్చే అవకాశం ఉంది. అవి రోడ్డు దాటే క్రమంలో అత్యంత వేగంతో ఉంటాయి. ఈ క్రమంలో వాహనాలకు తాకితే వన్యప్రాణికి గాని లేదా వాహనదారుడికి గాని అపాయం జరిగే అవకాశం ఉంది. ఇందులో భాగంగా జన్నారం అటవీ డివిజన్‌లోని ఇందన్‌పల్లి, జన్నారం, తాళ్లపేట్ అటవీ రేంజ్‌ల పరిధిలోని పలు ప్రాంతాలను ఎన్నుకుని ఆయా ప్రాంతాల్లో వ్యూలైన్స్ ఏర్పాటు చేశారు. ఎడమ, కుడి వైపుల గుబురు పొదలు, పిచ్చి మొక్కలు తొలగిస్తారు. పిచ్చి మొక్కలు, గుబురు పొదల నుంచి అడవినుంచి బయటకు వచ్చే వన్యప్రాణి కనిపించేలా చూస్తారు. ప్రధాన రహదారికి ఇరువైపులా 10 మీటర్ల దూరంలోని పొదలను తొలగించడంతో వాహనంపై వెళ్లే వారికి వన్యప్రాణులు బయటకు వచ్చే సమయంలో కనిపించే అవకాశం ఉంది. వన్యప్రాణి బయటకు వచ్చే సమయంలో వాహనం వేగం తగ్గించి ప్రమాదం నుంచి బయట పడవచ్చని అధికారులు భావిస్తున్నారు.

అడవిలోనూ వ్యూలైన్స్

ప్రధాన రహదారి వైపునే కాకుండా అడవిలోనూ వ్యూలైన్స్ ఏర్పాటు చేశారు. ఇందన్‌పల్లి అటవీ రేంజ్ పరిధిలోని మైసమ్మ కుంట వైపు, బర్తన్‌పేట్ బేస్‌క్యాంప్ వైపు, జన్నారం అటవీ రేంజ్‌లోని గొండుగూడ బేస్‌క్యాంప్, బైసన్‌కుంట, చింతగూడ ప్రాంతాల్లో వ్యూలైన్స్ ఏర్పాటు చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులను సఫారీ ద్వారా ఈ ప్రాంతాల్లో తిప్పే క్రమంలో వాహనాలకు ఆటంకం కలగకుండా అటవీ ప్రాంతంలోనూ వ్యూలైన్స్ ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. జన్నారం అటవీ డివిజన్‌లోని మూడు రేంజ్‌లలో కలిపి 126 కిలో మీటర్ల దూరంలో వ్యూలైన్స్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

ప్రమాదాల నివారణకే..



అటవీ ప్రాంతంలో ప్రయాణించే ప్రయాణికులు, వాహనాలు, వన్య ప్రాణులకు ప్రమాదం వాటిల్లకుండా, ప్రమాదాల నివారణకు వ్యూలైన్స్ ఏర్పాటు చేశాం. ప్రధాన రహదారితో పాటు అడవిలో పర్యాటక ప్రదేశానికి వెళ్లే ప్రాంతాల్లో వ్యూలైన్స్ ఏర్పాటు చేశాం. వ్యూలైన్స్ ద్వారా అడవి నుంచి బయటకు వచ్చే వన్యప్రాణులు కనిపిస్తాయి. అటవీ ప్రాంతంలోకి వెళ్లేటప్పుడు వాహన వేగం గంటకు 30 కిలో మీటర్లు మించి వెళ్లకూడదు.

– హఫీజొద్దీన్, రేంజ్ అధికారి

ఆక్రమణకు గురైన బూర్గుపల్లి చెరువులో సర్వే


సర్వే చేస్తున్న ఇరిగేషన్ డీఈ, రెవెన్యూ అధికారులు

భీమారం: మండలంలోని బూర్గుపల్లి వద్ద గల కిష్టయ్యకుంట చెరువులో బుధవారం ఇరిగేషన్ డీఈ శారద నేతృత్వంలో అధికారుల బృందం సర్వే నిర్వహించింది. ఈమేరకు డీఈ మాట్లాడుతూ.. 305 సర్వే నంబర్‌లో 10 ఎకరాల 10గుంటల భూమిలోగల కిష్టయ్య కుంటను పలువురు ఆక్రమించుకున్నారని తెలిపారు. దీనిపై పలువురు రైతులు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఆక్రమించిన భూములకు పట్టాలు పొంది ప్రభుత్వ పథకాలు పొందుతున్నారని తెలిపారు. చెరువు శిఖం భూమిని సర్వే ద్వారా గుర్తించినట్లు పేర్కొన్నారు. ఈ విషయంలో తహసీల్దార్‌కు లేఖ రాసి ఆక్రమణకు గురైన భూమిని తిరిగి ఇరిగేషన్ శాఖకు అప్పగించాలని కోరనున్నట్లు ఆమె తెలిపారు. ఏఈ అఖిల్, సర్వేయర్ నాగరాజు పాల్గొన్నారు.

'నిందితులను కఠినంగా శిక్షించాలి'


మాట్లాడుతున్న జలేందర్ కుటుంబ సభ్యులు


భీమిని: తన భర్తను దారుణంగా హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించి న్యాయం చేయాలని బొడ్డు శారద కోరింది. మండలంలోని కేస్లాపూర్ గ్రామంలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడింది. నవంబర్ 30న ఎన్నికల సందర్భంగా ఓటు వేసేందుకు తన భర్త జలేందర్‌తో కలిసి వెళ్లానని తెలిపింది. ఓటు వేసి వస్తుండగా కొందరు తమను బూతులు తిడుతూ చంపుతామని బెదిరించారని ఆరోపించింది. మరుసటిరోజు డిసెంబర్ 1న జలేందర్ బెల్లంపల్లి వైపునకు వస్తుండగా కేస్లాపూర్ గ్రామంలోని హన్మాన్ ఆలయం వద్ద వారే దాడి చేసి హత్య చేశారని ఆరోపణలు చేసింది. హత్య చేసిన వారిలో ఒకరు లొంగిపోగా మరో ఇద్దరిని పోలీసులు పట్టుకున్నారని తెలిపింది. ఈ కేసులో మొత్తం ఐదుగురు జైలుకు వెళ్లినట్లు పోలీసులు తెలిపినా వారి పేర్లు బయటకు చెప్పడం లేదని పేర్కొంది. ఈ హత్యలో ప్రధానపాత్ర వహించిన ఓ వ్యక్తి ఇంకా పరారీలో ఉన్నాడని, పోలీసులు నిర్లక్ష్యం చేస్తూ పట్టుకోవడం లేదని ఆరోపించింది. హత్య చేసిన వారిలో కేస్లాపూర్‌కు చెందిన మరికొంత మంది ఉన్నారని, వారు గంజాయికి అలవాటుపడ్డారని తెలిపింది. బయట ఉన్న వారితో ఇప్పటికీ తమకు ప్రాణహాని ఉందని, తమ ఇంటి చుట్టూ తిరుగుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని పేర్కొంది. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి తన భర్త హత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని వేడుకుంది.

కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచాలి


మంత్రి సీతక్కకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నస్పూర్: సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచాలని, చట్టబద్ధమైన హక్కులు, సౌకర్యాలు కల్పించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు డి బ్రహ్మానందం తెలిపారు. బుధవారం ఆయన నాయకులతో కలిసి సీసీసీ సింగరేణి గెస్ట్‌హౌస్‌లో స్త్రీశిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్కకు వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సింగరేణి వ్యాప్తంగా 11 డివిజన్లలో సుమారు 30వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయకుండా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం హామీ విస్మరించి అన్యాయం చేసిందని ఆరోపించారు. కాంట్రాక్ట్ కార్మికులకు కోల్ ఇండియాలో మాదిరిగా హైపవర్ కమిటీ వేతనాలు అందించాలని, ప్రమాదంలో చనిపోయిన కార్మికుల కుటుంబానికి రూ.15 లక్షల పరిహారం చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో శ్రీరాంపూర్ డివి జన్ నాయకులు ఎం.పోషమల్లు, మాడుగుల శంకర్, బీ యాదగిరి, బీ అప్పారావు, మోతె శేఖర్, గద్దల శంకర్, శోభ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో కార్మికుడి మృతి


శ్రీనివాస్ (ఫైల్)

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియా వర్క్‌షాప్‌లో జనరల్ మజ్దూర్‌గా పని చేస్తున్న విలాసాగరపు శ్రీనివాస్ (35) గుండె పోటుతో మృతి చెందాడు. శ్రీనివాస్ బుధవారం ఉదయం విధులకు హాజరయ్యాడు. డిస్ట్రిబ్యూషన్ కోసం వేచి ఉన్న సమయంలో తనకు అస్వస్థతగా ఉందని ఒక్కసారిగా కుప్పకూలాడు. వెంటనే తోటి కార్మికులు కంపెనీ వాహనంలో ఆర్కే 8 డిస్పెన్సరీకి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం రామకృష్ణాపూర్ ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. వీరి కుటుంబం ఆర్కే 6 ఏరియాలోని గణేశ్‌నగర్‌లో నివాసముంటోంది. ఏరియా జీఎం బీ సంజీవరెడ్డి ఏరియాస్పత్రికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించారు. వారి కుటుంబానికి కంపెనీ పరంగా అందించాల్సిన సహాయ సహకారాలు, చెల్లింపులు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

దొనబండలో యువతి మౌనపోరాటం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం దొనబండ గ్రామానికి చెందిన ఓ యువతి అదే గ్రామానికి చెందిన ఎండీ సమీర్ ఇంటి ఎదుట బుధవారం బైఠాయించింది. తనను పెళ్లి చేసుకోవాలని మౌనపోరాటానికి దిగింది. వివరాలు.. దొనబండ గ్రామానికి చెందిన సమీర్ ఎంబీఏ పూర్తి చేసి హైదరాబాద్‌లో ఉంటున్నాడు. ఇదే గ్రామానికి చెందిన ఓ యువతి ఇంటర్ పూర్తి చేసి ఉన్నత చదువుల కోసం హైదరాబాద్‌కు వెళ్లి సమీర్ ఉండే గదిలోనే ఉంటోంది. సుమారు ఏడాదిపాటు ఒకే గదిలో ఉన్న వీరిద్దరూ ఇటీవల దొనబండ గ్రామానికి వచ్చారు. కాగా, సదరు యువతి బుధవారం సమీర్ ఇంటి ఎదుట మౌనపోరాటానికి దిగింది. సమాచారం తెలుసుకున్న హాజీపూర్ ఎస్సై నరేశ్‌కుమార్ ఘటనాస్థలానికి చేరుకుని యువతి ద్వారా వివరాలు తెలుసుకున్నారు. ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కాగా, తాను ఫిర్యాదు ఇవ్వలేనని, సమీర్‌తో పెళ్లి చేయాలని డిమాండ్ చేసింది. సమీర్‌ను పోలీసులు విచారించగా.. తాను జైలుకు వెళ్లేందుకైనా సిద్ధమే కానీ సదరు యువతిని పెళ్లి చేసుకోలేనని తేల్చిచెప్పాడు. దీంతో ఆ యువతి మౌనపోరాటం కొనసాగిస్తోంది.

కోల్‌కతా సమావేశానికి జిల్లా టీఎన్జీవో సభ్యులు


సమావేశంలో పాల్గొననున్న సభ్యులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): కోల్‌కతాలో 28నుంచి 30వ తేదీ వరకు జరగనున్న అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య జాతీయ కార్యవర్గ సమావేశంలో మంచిర్యాల జిల్లా టీఎన్జీవో యూనిట్ సభ్యులు పాల్గొంటున్నారు. టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి, ప్రధాన కార్యదర్శి భూముల రామ్మోహన్, అటవీశాఖ రాష్ట్ర ఫోరం అధ్యక్షుడు, టీఎన్జీవో రాష్ట్ర కార్యదర్శి పొన్న మల్లయ్య, టీఎన్జీవో మాజీ అధ్యక్షుడు కందుకూరి సురేశ్ బాబు సమావేశానికి హాజరు కానున్నారు. సీపీఎస్ రద్దు, ఆదాయ పన్ను పరిమితి పెంపు, అవుట్ సోర్సింగ్, ఉద్యోగుల రెగ్యులరైజేషన్ తదితర ప్రధాన డిమాండ్లతో జరగనున్న సమావేశంలో మంచిర్యాల జిల్లా ఉద్యోగుల పక్షాన పాల్గొని తమ నిర్ణయాన్ని వ్యక్తం చేయనున్నామని సభ్యులు తెలిపారు.

నేడు ఏఎన్‌ఎం తాత్కాలిక మెరిట్ జాబితా ప్రదర్శన

మంచిర్యాలఅర్బన్: ఈనెల 28వ తేదీన తాండూర్, భీమిని కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న ఏఎన్ఎం పోస్టుల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల తాత్కాలిక మెరిట్‌జాబితాను సమీకృత జిల్లా కార్యాలయంలోని డీఈవో ఆఫీస్ నోటీస్ బోర్డుపై ప్రదర్శించనున్నట్లు డీఈవో యాదయ్య బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు జాబితాను సరిచూసుకుని అభ్యంతరాలుంటే ఈనెల 28నుంచి 30వ తేదీ వరకు అప్పీలు చేసుకోవాలని సూచించారు.

రాములవారి అక్షింతల ఊరేగింపు

భీమిని: రాములవారి అక్షింతలు బుధవారం కన్నెపల్లి మండల కేంద్రానికి చేరుకున్నాయి. ఈ సందర్భంగా భక్తులు వీధుల గుండా ప్రత్యేక పల్లకిలో ఊరేగించారు. భజన పాటలు, కోలాటాల మధ్య శోభాయాత్ర నిర్వహించి వేంకటేశ్వరస్వామి ఆలయానికి తీసుకెళ్లారు.

మానవత్వం చాటిన ఎమ్మెల్యే

- ఫిట్స్ వచ్చిన కార్మికుడికి సపర్యలు


వెంకటేశ్‌కు సపర్యలు చేస్తున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

శ్రీరాంపూర్: ఆపదలో ఉన్న వ్యక్తిని ఆదుకుని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు మానవత్వం చాటుకున్నారు. సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో భాగంగా బుధవారం ఎమ్మెల్యే ఆర్కే 6 గని వద్దకు వెళ్లాడు. అక్కడ గేట్ బయట ప్రచారం చేస్తున్న ఐఎన్టీయూసీ నాయకులను కలిసి ఓటింగ్ సరళిపై చర్చిస్తున్నారు. ఈక్రమంలో అదే గని కార్మికుడు వెంకటేశ్ ఓటు వేయడానికి రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తూ ఒక్కసారిగా ఫిట్స్ వచ్చి కుప్పకూలాడు. అదే సమయంలో అక్కడున్న ఎమ్మెల్యే వెంటనే స్పందించి హుటాహుటిన అతడిని దగ్గరకు తీసుకుని చేతులు నలుస్తూ, మంచినీళ్లు తాగించాడు. రెండు నిమిషాల పాటు సపర్యలు చేశారు. చికిత్స కోసం వెంటనే తన జీపులో సమీపంలోని ఆర్కే 8 డిస్పెన్సరీకి తరలించారు. ఎమ్మెల్యే స్పందించిన తీరుకు అక్కడున్న నేతలంతా మెచ్చుకోకుండా ఉండలేకపోయారు.

'గుర్తింపు' కోలాహలం

- సింగరేణి ఎన్నికల్లో ఉత్సాహంగా ఓటేసిన యువ కార్మికులు
- చివరిసారి ఓటేసిన సీనియర్లు


ఆర్కే 7 గనిలో ఓటేసేందుకు వస్తున్న యువ కార్మికులు

శ్రీరాంపూర్: సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో యువ ఓటర్ల కోలాహలం కనిపించింది. కారుణ్య ఉద్యోగాలతో కంపెనీలో చేరిన యువతీయువకుల సంఖ్య పెరిగింది. సగం మంది యువ ఓటర్లే ఉన్నారు. 2017 గుర్తింపు సంఘం ఎన్నికలతో పోల్చితే కంపెనీలో ఎక్కడ చూసినా యువ కార్మికులే ఈ ఎన్నికల్లో కనిపించారు. యువ కార్మికులు బృందాలుగా వచ్చి ఓట్లు వేస్తున్న సన్నివేశాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నూనూగు మీసాల యువకులు ఎంతో ఫ్యాషన్‌గా తయారై ఓటు వేసి వెళ్తున్న సన్నివేశాలు చూసి సీనియర్ అధికారులు ముచ్చటపడ్డారు. ఇదే సింగరేణి భవిష్యత్ అంటూ చర్చించుకున్నారు. గతంతో పోల్చితే మహిళా ఉద్యోగుల సంఖ్య కూడా పెరిగింది. వర్క్‌షాప్, స్టోర్స్, గుట్కాల షెడ్డు, కార్యాలయాల్లో పని చేసే యువ మహిళా కార్మికులు గుంపులుగా రావడం, లైన్‌లో నిల్చున్న సన్నివేశాలు ప్రత్యేకంగా కనిపించాయి. ఓటు వేసి వచ్చిన తర్వాత అంతా కలిసి సెల్ఫీలు దిగుతూ మొదటి ఓటు.. అంటూ వాట్సాప్ స్టేటస్‌లు పెట్టుకుంటూ మురిసిపోయారు. అన్ని సంఘాల వారు యువ ఓటర్లకు గాలం వేయడం కోసం వారిని పోలింగ్ కేంద్రాల ముందు గేట్ల వద్ద అధికసంఖ్యలో ఉండేలా చూశారు. చివరి నిమిషంలో వారి ద్వారా కూడా ఓట్లు అడిగారు.

మొదటిఓటు మరిచిపోలేను



సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో మొదటి సారి ఓటు వేయడం మరపురాని జ్ఞాపకం. రెండేళ్ల క్రితం కారుణ్య ఉద్యోగం ద్వారా సింగరేణిలో చేరాను. నా భవిష్యత్, కంపెనీ భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని నా మొదటి ఓటు వినియోగించుకున్నా. కార్మికుల సమస్యలు పరిష్కరించి హక్కులను సాధిస్తుందనే నమ్మకం ఉన్న సంఘానికే ఓటేశాను. గెలిచిన సంఘం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలి. యువ ఉద్యోగుల సమస్యలు తీర్చాలి. హక్కులు సాధిస్తూ కార్మికుల మన్ననలు చూరగొనాలి.

– పారుపల్లి నిఖిలేశ్, జనరల్ మజ్దూర్, ఎస్సార్పీ 3, 3ఏ గని

బాధతో చివరి ఓటేసిన



సింగరేణిలో ఇప్పటికీ ఏడుసార్లు ఓటేసిన. ఇక ఇదే చివరి ఓటు. పదినెలల్లో రిటైర్డ్ అవుతున్నా. పెరిగిన ఒక సంవత్సరం అదనపు సర్వీస్‌తో ఉద్యోగంలో ఉన్నా. నా సర్వీస్ పూర్తయినప్పటికీ ఇంకా కంపెనీలో ఉన్న వారి భవిష్యత్ కోసం సరైన సంఘానికే ఓటేసిన. మొదటి ఎన్నికలకు ఇప్పటికీ కార్మిక సంఘాల తీరులో చాలా మార్పులు వచ్చినయ్. కంపెనీలో పని చేసేవారు ఏ రోజుకైనా దిగిపోవాల్సిందే. అయినప్పటికీ రిటైర్మెంట్ కారణంగా ఇప్పుడు ఇదే చివరి ఓటు కావడం కాస్త బాధగా ఉంది. గెలిచిన సంఘం ఉద్యోగులందరికీ మేలు చేయాలి.

– పీ సమ్మయ్య, కోల్‌కట్టర్, ఆర్కే 7 గని

లింక్‌రోడ్డు పనులు పునఃప్రారంభం


లింక్ కలపడానికి జేసీబీతో తవ్విస్తున్న సిబ్బంది

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో తలపెట్టిన స్పెషల్ ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ లింక్ రోడ్డు పనులు పునఃప్రారంభమయ్యాయి. అసంపూర్తిగా ఉన్న రోడ్డు పనుల కోసం మూడురోజులుగా జేసీబీతో మట్టి తవ్వకపు పనులు చేపట్టారు. ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ పరిధికి వెళ్లడానికి కొత్త బస్టాండ్‌కు వెళ్లే మార్గంలో ఉన్న క్రాస్ రోడ్డుకు లింక్ కలపనున్నారు. ఇందుకోసం గతంలో 90శాతం వరకు మట్టి తవ్వకాలు చేపట్టి రోడ్డు నిర్మించగా అర్ధంతరంగా పనులు ఆగిపోయాయి. వంద మీటర్ల వరకు మట్టి తవ్వి రోడ్డు నిర్మాణం చేయాల్సి ఉండగా ప్రస్తుతం పనులు చేపట్టారు. ముందుగా జేసీబీతో మట్టిని తవ్వి రోడ్డు నిర్మిస్తున్నారు. మట్టిని రోలర్‌తో తొక్కించి రోడ్డును చదును చేసి బీటీరోడ్డు వేయనున్నారు. ఇందుకు సంబంధించిన ఆయా పనులు చకచకా జరుగుతున్నాయి. బీటీ రోడ్డు నిర్మాణంలో భాగంగా మట్టి రోడ్డుపై కంకర వేసి చదును చేసే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రధాన రహదారికి లింక్ కలపడానికి విద్యుత్ స్తంభాలు అడ్డంకిగా ఉన్నాయి. వీటిని తొలగించాల్సి ఉంటుంది. ఆ ప్రక్రియ అయ్యేవరకు వేచి చూడకుండా ప్రస్తుతం కంకర రోడ్డు పనులు కొనసాగిస్తున్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ జోన్‌లో అంతర్గత రోడ్లు, విద్యుత్ సౌకర్యం, మురుగునీటి కాలువలు, కల్వర్టుల నిర్మాణం కోసం రూ.30 కోట్ల నిధులు మంజూరైన సంగతి తెలిసిందే. జోన్ ఆవరణలో దాదాపు ఆయా పనులన్నీ పూర్తయ్యాయి. అసంపూర్తిగా ఉన్న లింక్ రోడ్డు పనులు పూర్తి చేయడానికి కసరత్తు జరుగుతుండటంతో ఆశలు చిగురిస్తున్నాయి.


ఏళ్లుగా ఇన్‌చార్జి అధికారే..



జిల్లా కేంద్రంలోని లీగల్ మెట్రాలజీ కార్యాలయం

పాతమంచిర్యాల: జిల్లాలో రెగ్యులర్ లీగల్ మెట్రాలజీ అధికారి లేకపోవడంతో వ్యాపారుల ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. కొనుగోలుదారులు, వినియోగదారులు వ్యాపారుల చేతిలో నష్టపోతున్నారు. జిల్లాలో 2016 నుంచి ఇప్పటివరకు ఇన్‌చార్జి తూనికలు, కొలతల శాఖ అధికారులే కొనసాగుతున్నారు. తూనికలు, కొలతల శాఖ అధికారులు ప్రతీనెల జిల్లా పరిధిలోని వ్యాపారులు, వినియోగదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ తూకాలు, కొలతల్లో తేడా రాకుండా చూసుకోవడం, వ్యాపారులు చేసే మోసాలను అరికట్టాల్సి ఉంది. కానీ.. జిల్లాలో ఇన్‌చార్జి తూనికలు, కొలతల శాఖ అధికారులే విధులు నిర్వహిస్తుండటంతో తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం లేదు. ఏదైనా సమస్య ఎదురైనప్పుడు ఫిర్యాదు చేయాలంటే ఇబ్బందులు ఎదురవుతున్నాయని పలువురు వినియోగదారులు, కొనుగోలుదారులు వాపోతున్నారు. తూనికల, కొలతలశాఖ ఆధ్వర్యంలో అధికారులు అప్పుడప్పుడు దుకాణాలు, వ్యాపార సంస్థలు, షాపింగ్ మాల్స్‌లలో తనిఖీలు నిర్వహిస్తూ ఏవైన లోపాలు వారి దృష్టికి వస్తే అడపాదడపాగా కేసులు నమోదు చేస్తున్నారు. దీంతో పాటు తూనికల పరికరాలకు ముద్రలు వేస్తున్నారు. తూనికలు, కొలతలశాఖ కార్యాలయంలో సిబ్బంది కొరత కారణంగా స్టాంపింగ్ పనులు కూడా పూర్తి స్థాయిలో చేపట్టడం లేదు. దీంతో వ్యాపారులు తూనిక రాళ్లు, వేయింగ్ మిషన్లు ఇష్టారీతిన వాడుతూ వినియోగదారులను మోసం చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో జిల్లా మెట్రాలజీ అధికారిగా కొనసాగుతున్న విశ్వేశ్వర్ పెద్దపల్లికి రెగ్యులర్ అధికారి కాగా, మంచిర్యాల జిల్లా ఇన్‌చార్జి తూనికలు, కొలతల శాఖ అధికారిగా కొనసాగుతున్నారు. జిల్లాలో పూర్తి స్థాయిలో మెట్రాలజీ అధికారిని నియమించి వ్యాపారుల మోసాలకు అడ్డుకట్ట వేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా శివ ముక్కోటి


ఉత్తర ద్వారం ద్వారా శివపార్వతులను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

మంచిర్యాలఅర్బన్: స్థానిక విశ్వనాథస్వామి దేవస్థానంలో బుధవారం శివ ముక్కోటి పర్వదినాన్ని వైభవంగా నిర్వహించారు. ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని నిర్వహించిన శివ ముక్కోటి ఉత్తర ద్వార దర్శనానికి వేకువ జామునుంచే భక్తులు తరలివచ్చారు. స్వామివారికి అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వనాథ ఆలయం శివనామస్మరణతో మార్మోగింది. ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు, మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు వేర్వేరుగా దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ముక్తారవి, అర్చకులు నరహరిశర్మ, బాలకృష్ణ, ముఖేశ్‌శర్మ, ఉద్యోగులు ప్రతాప్, గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.